# అమూల్యం

## కె.సభా (1923-1980)

**దా**దాపు మూడు దశాబ్దాల పాటు కథా ప్రపంచంలో తనదైన శైలిలో విహరించి, మూడు వందల కథలు పైగా రచించారు. చిత్తూరు జిల్లా, కొట్రకోన వారి జన్మస్థలం. పాతాళ గంగ, బంగారు, బడి పంతులు, కె.సభా కథలు సంపుటాలుగా వచ్చాయి. భిక్షుకి, మొగిలి మొదలైన నవలలు వెలువరించారు. రెండు మూడు పద్య కావ్యాలను కూడా రచించారు. చిత్తూరు శారదా పీఠం ఆధ్వర్యంలో వెలువడిన 'దేవదత్తం' ఆధ్యాత్మిక మాస పత్రికకు సంపాదకులుగా పనిచేశారు. వాసిలో, రాశిలో కూడా ఆయన ఎన్నతగినవారు.

**వా**కిట్లో అడుగు పెట్టగానే గట్టిగా మొరిగింది కుక్క. పలకరిస్తే కుక్కలేమీ చేయవని అనడం విన్నాను. పైగా బెదిరితే చూచిన వాళ్ళు నవ్వుకోవచ్చు. అంచేత ప్ప్ ప్ప్ ప్ప్ అంటూ చిటికెలు వేస్తూ ముందుకు వెళ్ళాను. అది నా పాదాలను వాసన చూస్తూ చుట్టూ ప్రదక్షిణం చేస్తుంటే నెమ్మదిగా వంగి వీపు నిమిరాను. అది తప్పుకొని గెంతుతూ లోపలికి వెళ్ళిపోయింది. ఇంటిలో ఎవరూ ఉన్న అలికిడి కన్పించలేదు. వసారాలో ఉన్న నవారు మంచాన్ని వాల్చుకొని కూచున్నాను. కుక్క మళ్ళీ బయటికి వచ్చి నన్ను ఎగాదిగా చూచి మంచం చుట్టూ తిరిగి లోపలికి వెళ్ళింది. ఇట్లా నాలుగైదుమార్లు లోపలికీ బయటికీ తిరిగాక స్నానాల గదిలో నుంచి బయటికి వచ్చారు కవిగారు.

"ఒక్క క్షణం కూర్చోవయ్యా!" అని ఆయన మళ్ళీ లోపలికి వెళ్ళిపోయాడు. కుక్క అటూ ఇటూ తిరగడం మానుకొని వాకిలికి అడ్డంగా పడుకొన్నది నా వంక చూస్తూ.

రెండు నిమిషాల్లోనే కవిగారు పేము కుర్చీ తెచ్చి మంచం ముందు వేసి కూచున్నారు. "బలే కుక్కను సంపాదించారే, ఎక్కడ పట్టుకొచ్చారు?" అన్నాను దాని వంక చూస్తూ.

"నేను పట్టుకరాలేదు. అదే వచ్చింది" అన్నారాయన.

"అదే వచ్చిందీ? ఎక్కడ నుంచి వచ్చింది?" అన్నాను నవ్వుతూ.

కవిగారు ఈ కుక్కను గురించి గూడా ఏదైనా కథ చెబుతారు కావాలనుకున్నాను ఆయన వాలకాన్ని చూచి. అంతే జరిగింది. ఆ కుక్కను గురించి ఆయన పెద్ద కథనే చెప్పారు. అసలు ఆయన మీద నాకు అభిమానం పుట్టిన ఘట్టం కూడా బహు చిత్రమైంది. ఆయన జాగిలాన్ని గురించి వ్రాసిన గేయాలను చదివి ఆయనను దర్శించాలనుకొన్నాను. ఒక మహాసభలో ఆయన ఉపన్యాసం ఉందని వెళ్లాను. తీరా వెళ్ళాక ఆయన సభలో ఆ జాగిలాన్ని గురించి వ్రాసిన గేయాలే చదివారు. ఆనాడు యేర్పడిందాయనతో పరిచయం. అప్పుడప్పుడూ తీరిక చిక్కినప్పుడల్లా ఆయన్ను దర్శించుకొంటూ ఉంటాను. వెళ్ళినప్పుడల్లా ఆయన

## ఆణిముత్యాలు

ఏదో ఒక కథ చెబుతూ ఉంటారు. ఆ కథల్లో ఎక్కువ భాగం నవ్వు పుట్టించేవి. కాస్సేపు సరదాగా కాలక్షేపం జరిగినా ఆ వ్యవధిలోనే విజ్ఞానం కూడా వికసిస్తుండేది.

"అది కాట్పాడి నుండి వచ్చిందయ్యా" అన్నారాయన. కాట్పాడి నుంచి కవిగారింటికొక కుక్క వచ్చిందంటే ఎలా నమ్మాలి? ఆయన చెబుతున్నారు గనుక నమ్మక తప్పదు. అసత్యం చెప్పవలసిన అవసరం ఆయనకు లేదు.

"నేను ఆ మధ్య తిరువణ్ణామలై వెళ్ళివచ్చాను. నీకు గుర్తుందనుకొంటాను. దారిలో కాట్పాడి స్టేషన్‌లో అటూ ఇటూ పచారు చేస్తున్నాను" అని అంటుండగానే జాగిలం తుర్రుమని వీధివైపు వెళ్ళింది. కవిగారి భార్య లోపలికి వస్తుంటే ఆమె వెనుక తోకను వూపుకొంటూ మళ్ళీ యథాస్థానం లోకి వచ్చి పడుకొంది.

"బలే మెలకువైంది. చీమ చిటుక్కుమంటే చాలు తెలుసుకొంటుంది. మనం మనిషి ముఖాన్ని చూచి కూడా అతని స్వభావాన్ని కనిపెట్టలేం. ఇది పాదాలను చూచి అతని హృదయాన్ని తెలుసుకొంటుంది. నిజం గానే చెబుతున్నాను. ఇది మా యింటికి వచ్చినప్పటి నుండి నాకెందుకో చాల సంతృప్తిగా వుంది. చెప్పరాదు గానీ నాకు మానవుల మీద విశ్వాసం నశించింది. దానికి బోలెడు కారణాలున్నవనుకో?" అంటూ జాగి లం వైపు చూశారు కవిగారు.

అది మెల్లగా లేచి కవిగారి పాదాలను స్పృశించి "కుయ్ కుయ్" మంటూ ఉన్నది. "వెళ్ళు. అమ్మను కాఫీ తీసుకురమ్మను" అన్నారు కవిగారు. ఆ మాట విన్న దవసరం అది ఒక్క గెంతులో లోపలికి వెళ్ళి పోయింది. కవిగారి భార్య రెండు కాఫీ కప్పులతో రావడాన్ని చూచి ఆశ్చర్యపడ్డాను.

"ఎందుకలా ఆశ్చర్యపడుతున్నావ్? ఇందులో ఆశ్చర్య పడవలసిందేమున్నది. ప్రాణంలేని యంత్రాలే మానవుడు చెప్పే పనులను చేస్తున్నాయి. ఇక ప్రాణం వుండే జంతువులు చేయడంలో విశేషమేముంది. దీని కన్నీ తెలుసు. నీకు చెబితే నమ్మవుగానీ, నేను ప్రయాణ మవుతుంటే చెప్పులు తెచ్చి పాదాల వద్ద పడవేస్తుంది. చేతి కర్రను అందిస్తుంది. దీని చిలిపి చేష్టలు చాల ఉన్నవనుకో. అసలు కథ చెబుతాను. ముందు కాఫీ తీసుకో" అన్నారు కవిగారు. నేను కాఫీ కప్పు నందు కోగానే కవిగారు జాగిలంవైపు చూచి "వెళ్ళి పాలు త్రాగు పో" అన్నారు. అది కవిగారి భార్యతో పాటు లోపలికి వెళ్ళిపోయింది. ఆ వెనుక నా వైపు చూచి ప్రారంభించారు కవిగారు.

"చల్లగా వెన్నెల. ఐనా మహా చలిగా ఉంది. శాలువను కప్పుకొన్నాను." చలి వేస్తున్నా ఆ వెన్నెల్లో ఆరుబయటే కూచుందామనిపించింది. ఒక చిన్న చెక్క మీద కూచుని ఆకాశం కేసి పరీక్షగా చూస్తున్నా. నా పాదాల నేదో స్పృశించింది. కాలితో విసిరాను. బరువుగా తగలడం... కుయ్యోమన్న ఏడుపు... కుక్క కరచిందేమోనని గాబరాపడ్డాను. ఊరికే స్పృశించిం దంతే. కాని దానికి నా కాలితాపు బాగా తగిలిందను కొంటాను. అది నిజంగానే ఏడ్చుకొంటూ ఆవలి వైపు వెళ్ళింది. అక్కడో ముసలాడు కర్రను విసరబోయాడు. తప్పుకొని మళ్ళీ నా వైపు వచ్చింది. నన్ను చూచి మళ్ళీ టీ దుకాణం వైపు వెళ్ళిపోయింది.

నా కెందుకో ఉన్నట్టుండి దానిమీద జాలి పుట్టింది.

## అద్దెకు అమ్మకడుపులు

కట్టుకోలేనివాడు / బాడుగకు ఇల్లు తీసుకున్నట్టు
నిరపాయకరం కాదని తెలిసీ / కొందరు
తాత్కాలికానంద జలధిలో / విహరించడానికి
దేహాల్ని బాడుగకు తీసుకుంటారు.
అద్దెకిప్పుడు / అమ్మలొస్తున్నారు/ నాన్నలొస్తున్నారు.
పొలం కౌలుకు తీసుకోవడమంటే
భూమిని అద్దెకు తీసుకోవడమే కదా!
ఒకప్పుడు- / మనో తటాకంలో
మధురోహ గులకరాయి / పడటం కూడా తప్పే.
ఇప్పుడేదీ తప్పుకాదు / ఏ బ్యాంకు వాళ్లో
వస్తువులు దాచుకోడానికి/లాకర్లు అద్దెకిచ్చినట్టు
ఎవరిదో వీర్యాన్ని/తన బిడ్డ సంచి ఫ్రిజ్‌లో భద్రపర్చి
నిర్మాణంలో వున్న యింటికోసం / యిటుకలు
మోసే ఆడకూలీల్లా / సుదూర ప్రయాణంలో
రైలు మోసుకొచ్చి దించేసిన బరువుని
తన నెత్తిమీదకెక్కించుకొని మోసే
హమాలీల్లా- / తనది కాని బిడ్డని
తొమ్మిది నెలలు మొయ్యడానికి
కడుపులు అద్దెకిచ్చే/ఆడవాళ్ళూ యిప్పుడు లభిస్తున్నారు.
ఇప్పుడెవరి కడుపు పంట
వారింటే పెరుగుతుందన్న భరోసాలేదు-
వార్ధక్యంలో మన పిల్లలు
మనవద్దే వుంటారన్న భరోసాలేనట్టు.
ఏ స్పందనలకీ ప్రాధాన్యత లేని / నటీనటుల
కౌగిలింతలా / అమ్మతనాన్ని బాడుగకివ్వడం
పేగుతెంచుకు పుట్టిన బిడ్డతో / మరుక్షణంలోనే
అనుబంధాన్ని కూడా తెంచేసుకోవడం
చెట్టు నుండి/ పండిన పండు రాలిపడినంత
సులభతరమైంది. / ఆర్థిక సంబంధాల
విశ్వరూపం ముందు / రక్తసంబంధాలిప్పుడు
మరుగుజ్జులైపోతున్నాయి / మంచికో చెడుకో తెలీని
నీతికీ అవినీతికీ మధ్యగల / సన్నని గీత చెరిపేసే
ఈ అద్దెకడుపుల కొత్త సంప్రదాయం
నేటి వినిమయ ప్రపంచంలో
ఒక కొత్త అధ్యాయం. / బిడ్డల పంటలు పండే
పొలాల్లాంటి కడుపుల్ని అద్దెకు తీసుకునేవారు
యిన్ని అన్నం ముద్దల్ని దాచుకోడానికి
నిరుపేదల కాలే కడుపుల్ని
అద్దెకు తీసుకుంటే ఎంత బావుంటుంది!

-మాధవీ సనారా

కారణం చెప్పలేను. కాలితో తన్నిన తాపునకు మంచి దెబ్బ తగిలి ఉంటుందని అనుకొన్నాను. ఆ సమయా నికి నాకు మా అమ్మ జ్ఞప్తికి రావడం చాలా విచిత్రం. చిన్నతనంలో మా యింట్లో ఒక కుక్కను పెంచుకొనే వాళ్ళం. దాని పేరు శివంగి. అది చాల ఎత్తుగానూ, బలంగానూ ఉండేది. నేనా కుక్కను చేత్తో గుద్దేవాణ్ణి. నా యిష్టం వచ్చినట్లు తన్నేవాణ్ణి. ఐనా అది పట్టించు కొనేదిగాదు. నా వద్ద తన్నులు తినడమే దానికొక సరదాగా ఉండేది. అమ్మ మాత్రం గట్టిగా చెప్పేది. "కుక్కను తన్నితే కాలికి సలుపు పడుతుంది" అని. ఆమె విశ్వాసమది. ఆ భయంతో క్రమంగా తన్నడం మానుకొన్నాను. పెద్దవాళ్ళేదో బలమైన కారణముంటేనే ఒక నియమాన్ని విధిస్తారనుకొంటాను. నోరులేని జంతువును కొట్టకూడదంటే వినరు. ఏదో రోగం వస్తుందని భయపెడతారు. ఆ విషయం నాకు జ్ఞప్తికి వచ్చింది. మా అమ్మ ఆజ్ఞను మళ్ళీ యిన్నాళ్ళకు ధిక్కరిం చానెందుకూ? అని నన్ను నేనే ప్రశ్నించుకొన్నాను. అమ్మ శివంగికి రాత్రుల్లో గోనెను కప్పి పెడుతుండేది. కుక్కకు కూడా చలి వేస్తుందన్న విషయం అమ్మకు తెలుసు. ఆ సత్యాన్ని నేను కాట్పాడి స్టేషన్‌లో కను గొన్నాను. ప్రత్యక్షంగా చూశాను. టీ దుకాణం వైపు వెళ్ళిన కుక్క బల్ల క్రిందకు చొరబడింది. దుకాణం వాడు ఒక్క తాపు తన్నాడు. అది అక్కడి నుండి మళ్ళీ గడగడలాడుతూ ఆరుబయటికి వచ్చింది. ప్రతి ప్రయా ణీకుని పాదాలను స్పృశించబోతోంది. ప్రతివాడూ దాన్నుండి తప్పుకొంటున్నాడు. నిజంగా దానికి చలి లేకుంటే అలా ఎందుకు తిరుగుతోంది!

ఒక్క చలి మాత్రమే గాదు. ఆకలి కూడా వేస్తున్నది గావాలి. టిఫిన్ స్టాల్ ముందు తింటున్న ప్రతివాని ముందూ నిలబడి ఎంతో జాలిగా చూస్తున్నది. దాని చూపులలో కన్పిస్తున్న ప్రార్థనా పూర్వకమైన భావాన్ని పసిగట్టే శక్తి మానవునికి లేదనుకొంటాను. ఎవరి ఆతురతలో వారున్నారు. అసలు జాగిలం వైపు చూచే టంతటి ఓపిక గూడా ఏ ప్రయాణీకుని కుంటుంది? రైలు స్టేషన్లలో టిఫిన్ స్టాల్సు ముందు కుక్కలకంటే మనుషులే ముందుగా కన్పిస్తారు. ఈ విషయం చెబుతుంటే నా కొకసారి గూడూరులో జరిగిన సంఘ టన జ్ఞప్తికి వస్తోంది. బండి నిలవగానే ముఖం కడు క్కొని ఒక పెరుగన్నం పొట్లం కొనుక్కున్నాను. విప్పే లోగా ఇద్దరు కుర్రాళ్ళు చేతులు చాచుకొని నిలబడ్డారు. అన్నం తింటుండగానే చేతులు చాస్తే మనం ఎలా తినగలం? ఆ పొట్లం వారికిచ్చేశాను. మళ్ళీ ఇంకొకటి కొనగానే యింకో నలుగురు కుర్రాళ్ళు ముందుకు వచ్చారు. అవి రాయలసీమ కరువు రోజులనుకో. అలా చూశాను. చుట్టూ ఇరవై మంది కుర్రాళ్ళున్నారు. జేబులోనున్న చిల్లర డబ్బులు లెక్కపెట్టాను. ఐదు రూపాయలున్నాయి. టిక్కెట్టు ఉంది గనుక ప్రయాణం సాగిపోతుంది. ఒక్క క్షణం ఆలోచించి నాలుగు రూపాయలకు పొట్లాలు కొనేశాను. ఇరవై ఒక్క పొట్లాలు. తలా ఒకటిచ్చాను. నేనూ ఒకటి విప్పి వారితో కలిసి తిన్నాను. భగవంతుడు నన్ను ఇంత వరకూ పస్తు పెట్టలేదనుకో, ఇంటికి వెళ్ళేలోగా ఒక పూటకే మిత్రుడో కనిపించి అన్నం పెడుతాడులేనని సాహసించాను. ఆ కుర్రవాళ్ళంతా తింటుండగా నేనెంత ఆనందాన్ని అనుభవించానో, సంతృప్తిపడ్డానో చెప్పలేను. నీతో గనుక చెబుతున్నాను. ఇలాంటి విషయాలు చెప్పుకోరానివి. చెప్పినా మానవమాత్రులు నమ్మలేనివి. ఆ పూటకాపూట గడుపుకొనే మనలాంటి వారు ఈలాంటి త్యాగాలు చేస్తారంటే లోకం నమ్మదు" అని పొగచుట్టను పైకి తీస్తూ, "అగ్గిపెట్టెను యిచ్చి పంపే" అంటూ కేక వేశారు కవిగారు. చిటికెలో అగ్గిపెట్టెను నోట కరచుకొని వచ్చింది జాగిలం.

కవిగారు అగ్గిపెట్టె నందుకొని చుట్టను ముట్టించి ప్రారంభించారు.

"స్టేషన్‌లో ఏదో బండి వచ్చి ఆగింది. చాలామంది దిగారు. అంతకంటే ఎక్కువమందే ఎక్కారు. ఎందరు దిగినా, మరెందరెక్కినా కుక్కను గురించి పట్టించుకొనే వారెవరూ కన్పించలేదు. వచ్చిన బండి వెళ్ళిపోయింది. నేనూ, మరో ఏడెనిమిది మంది మాత్రమే మిగిలాము. బుక్‌స్టాల్ కొంచెంగా తెరచి అమ్మే కుర్రాడు కునికిపాట్లు పడుతూ కూచున్నాడు. కుక్క అటూ యిటూ తిరుగు తూనే ఉంది. దాని కడుపు వీపునకు అంటుక పోయింది. బాగా ఆకలి వేస్తున్నట్టుంది. కొళాయి వద్ద చిన్న చిన్న గుంటల్లో నిలిచిన నీటిని చప్పరించి మళ్ళీ నా పాదాల వద్దకు వచ్చింది. అతి దీనంగా చూస్తూ నిలబడింది. నా కా క్షణంలో వివేకానందుడు జ్ఞప్తికి వచ్చాడు. "నా దేశంలో ఒక కుక్క కూడా పస్తు పడుకో రాదు" అన్నాడాయన. ఆ మాటలో ఎంత అర్థముంది! అంతటి మహనీయుడు గనుకనే వివేకానందుడు చరితార్థుడయ్యాడు. అవును. దేశంలో ఎక్కడైనా సరే, ఒక కుక్కపిల్ల కూడా పస్తు పడుకోరాదు. అలాంటి ప్రతినతోనే దేశోద్ధరణకు కంకణం కట్టుకొన్నాడు స్వామి

వివేకానంద.

కానీ నా కళ్ళముందు ఒక కుక్క పస్తు పడుకొన్నది. అది ఆకలిగా ఉన్నదని, తనకు అన్నం పెట్టమని దానికి కనిపించిన ప్రతి మనిషినీ అర్థించింది. దాదాపు రెండు గంటల నుండి దానిని పరిశీలిస్తున్నాను. ఎందరినో యాచించింది. దానికీ నోరు ఉంటే మానవ భాష మాట్లాడగలిగి ఉంటే గట్టిగా ఎలుగెత్తి చెప్పి ఉండేది. "భిక్షాం దేహి" అని శ్రావ్యంగా పాడి ఉండేది. ఈశ్వరుడా భాష నివ్వలేదు. ఒక్క చూపులతోనే అర్థించ గలదు. కనులతోనే యాచించగలదు. అడిగితేనే, గట్టిగా గొంతెత్తి ఏడుస్తూ యాచించితేనే తోటి మానవునికి అన్నం పెట్టని మానవుడు, చూపులతో యాచించే కుక్కకు అన్నం పెడుతాడా? అసలు కుక్కలవైపు చూచే విశ్రాంతి మానవుని కెక్కడిది? స్టేషన్‌లో కూచుంటే

## బుద్ధుడు మళ్ళీ పాదయాత్ర చేస్తున్నాడు...

**సం**ఘర్షణ జరుగుతున్న చోటల్లా
నూత్నాంశాలు జనిస్తాయి
ఎవరు ఎవరితో సంఘర్షిస్తున్నారు
ఎవరు దేన్ని ఆక్రమించాలని చూస్తున్నారు
మొదటి గీతలకంటే
రెండవ గీతలే ఎందుకు ఘనీభవిస్తున్నాయి
స్వేచ్ఛా రాహిత్యం వల్ల
శక్తులు నిర్వీర్యం కావడం లేదా?
హాబ్సుకంటే రూసోనే ఎందుకు
మెరుగ్గా ఆలోచించాడు
మనిషి చేతులకు సంకెళ్లు వేసినపుడు
మణికట్టు సామర్థ్యం
ఇనుమును అధిగమించింది కదా!
నీవు ఆహారాన్ని అధిగమించి
ఆహార్యాన్ని, నివాసాన్ని / విహారాన్ని, వినోదాన్ని
దాటుకొంటూ పోతున్నావు
నీ కెమెరాలో సుందరమైన ప్రకృతి
మధ్యలో ఓ బక్క చిక్కిన మనిషీ ఉన్నాడు
వాణ్ణి నీవు తొలగించలేవు
ఏది సుందరమైంది? ఏది వికృతమైంది?
ఏ రసాన్ని ఏ రసం విభేదిస్తుంది
మానవుని శ్రమ నిర్దయగా దోచబడుతున్న చోట
జీవన వ్యవస్థలన్నీ భగ్నమౌతున్నాయి
తోటలో రాలుతున్న ఆకుల కంటే
మనుషులు బలహీనులయ్యాక
తోటకర్థ మేముంది? / వీధుల నిండా
బంగ్లాల నిండా కుక్కలే / అవి బలపడుతున్నాయి
గాయపరుస్తున్నాయి / అవును మీరు
మనుష్యుల నుండి / క్రూర జంతువుల
రక్షణను కోరుతున్నారు
మీ వేపు చూసే చూపులో / క్రౌర్యమున్నా మీరు
ఆలింగనం చేసుకుంటున్నారు / మీరు తరువాత
చీల్చి వేయబడుతున్న స్థలాల్లో
నాగరికత ముసుగులో ఉన్న
హింసను గుర్తిస్తున్నారు / అవును
మనిషికి, మనిషి తత్వమే ముఖ్యం
అది సంఘనిర్మాణంలో అంతర్గతంగా దాగివుంది
ఏ సంఘం అనేది కూడా ప్రశ్నే
ఏ కట్టుబాటు అనేది కూడా ప్రశ్నే
వ్యక్తిని బానిసగా చేసిన సంఘం
మనిషిని మాట్లాడనివ్వని సంఘం
సంఘం అంటే అది కాదు
వ్యక్తులు స్వతంత్రంగా ఎదుగుతూనే
ఒక పాలపుంతలో గ్రహాల మధ్య
ఒకదానికొకటి ఉండే
అవినాభావ సంబంధం కలిగివుండటమే సంఘం
అది ఊటి లోయలో కావచ్చు
డార్జిలింగ్ కొండలపై కావచ్చు
బుద్ధుని సందేశం వల్లే మండుటెండల్లో కూడా
ఆ చల్లదనం వచ్చింది సుమా!
మానవీయతను కోల్పోని
వ్యక్తి వికసనమైన సంఘం / అందరూ బలంగా
అందరూ ఆలోచనాపరులుగా ఉండే సంఘం
సంఘానికి భాష, భావం
జీవనం, వ్యక్తిత్వం సమతుల్యమై ఉండాలి.
అందుకే బుద్ధుడు / మళ్ళీ ప్రపంచమంతా
పాదయాత్ర చేస్తున్నాడు
ఆయనతో మనమూ నడుద్దాం!

**–కత్తి పద్మారావు**

కళ్ళకు ఆకర్షించేవి యెన్నో ఉంటాయి. కూడలి కేంద్రాలైతే ఎన్నో ప్రాంతాల మనుషులు దిగుతూ ఎక్కుతూ ఉంటారు. వారిలో అందమైనవారు కూడా ఉంటారు. సహజంగా వారి సౌందర్యాల వైపు తిరుగుతుంటాయి పరిశీలకుల నేత్రాలు. ఆ మాటకు వస్తే అందరూ అంతే. కవులూ చిత్రకారులూ ఎవరైతేనేం... కాముకులూ విరాగులూ అందరూ ఏదో అందం చేతనే ఆకర్షించబడతారు. నిజానికి నేనూ అంతే. ఐనా ఆ రోజు ఆ రెండు గంటలసేపూ ఆ కుక్కను గురించి ఆలోచిస్తూ దాన్ని పరిశీలిస్తూ ఉండిపోయానంటే నాకే ఆశ్చర్యంగా ఉంది.

ఆ సమయంలోనే నేను కుక్కను గురించి వ్రాసిన గేయాలుకూడా జ్ఞప్తికి వచ్చాయి. ఒక్కొక్క పాదమూ స్మరణకు వస్తున్నాయి. ఆచరణ వేరు; కవిత్వం వేరు. ఉపన్యాసాలలో కన్పించే ధర్మాలు నిత్యజీవితాల్లో కన్పిస్తే ప్రపంచం ఇంత అధ్వాన్నంగా ఉండేది కాదు. మరి గేయాలు వ్రాస్తూ కథలు చెబుతూ కరుణా, జాలి అంటే అర్థమేముంది? అందుకనే తక్షణం లేచాను. టిఫిన్ స్టాల్ వైపు వెళ్ళి ఒక పొట్లాన్ని కొన్నాను. చకచకా కుక్క దగ్గరికి వెళ్ళి పొట్లాన్ని విప్పి ముందుంచాను. ఒక్క మెతుకునైనా వదిలిపెట్టకుండా తిన్నది, మధ్య నా వైపు రెండు మూడు మార్లు చూచింది. ఆ చూపుల్లోని కృతజ్ఞతా భావాలను కొలిచే సాధనాలను మానవుడింతవరకూ కనిపెట్టలేదు. గాలినీ, ద్రవ పదార్థాలనూ, ఘన పదార్థాలనూ కొలవడం తేలిక గావచ్చు కానీ, ఒక ప్రాణి మరో ప్రాణికి చూపే కృతజ్ఞతను కొలవడం యెట్లా? ఒకరి పట్ల మరొకరి కున్న ప్రేమను విలువకట్టేదెట్లా? ఇవన్నీ ప్రశ్నించుకొన్నప్పుడు మానవునికి పరిష్కరించకుండా మిగిలిపోయిన సమస్యలు అసంఖ్యాకంగా కన్పిస్తాయి. ఉదాహరణకు నేను కవినైనా ఆ క్షణంలో ఈ జాగిలం చూచిన చూపును, ఆ దృక్కులలో కన్పించిన కృతజ్ఞతలను వర్ణించలేకపోయాను. ఆప్యాయంగా మళ్ళీ పాదాలను స్పృశిస్తూంటే దాని ఒంటిమీద చెయ్యి వేశాను. అలాంటి స్పర్శను అనుభవించి ఎన్నాళ్లయిందో తెలియదు. ప్రతిచోటా అది దెబ్బలు తింటూ వచ్చింది కావాలి. మానవులంతా తమ జాతిని కొట్టడానికే పుట్టారేమోనని అనుకొని ఉంటుంది. కానీ కొన్ని కుక్కలైనా యజమానుల వెంట సరదాగా తిరగడాన్ని అది చూచి ఉంటుంది. అంచేత అలాంటి అవకాశం తనకూ ఉంటే ఎంత బావుండునని అది అనుకొని ఉంటుంది కావాలి.

ఏమైతేనేం! కుక్కకు అన్నం పెట్టాను. దాని ఆకలి తీరిపోయింది. పాపం పుణ్యంమాట అటుంచి ఆత్మలూ, పరమాత్మలూ స్వర్గమూ నరకమూ యివన్నీ యథార్థమైతే కనీసం వివేకానందుని ఆత్మకు కొంత మట్టుకు సంతృప్తి కల్గి ఉంటుందనుకొంటాను. ఇలాంటి ఊహలు కొందరి దృష్టిలోనే కాదు, చాలామంది దృష్టిలో అసహజాలే కాదు, అప్రయోజనాలుగా కూడా కన్పిస్తాయి. కానీ భావన, ఊహ, ఆశ, కల, ఆవేదన, సంతృప్తి యివన్నీ లేనపుడు మనిషి యంత్రమై పోతుంటాడు. చలనం లేని జడపదార్థమై అతని హృదయం ఉక్కుకంటే కఠినమై పోతుంది.

బండి రావడాని కింకో అరగంట వ్యవధి ఉన్నది. కాస్సేపు నడుం వాలిస్తే బావుండు ననిపించింది. పడుకోడాని కనువైన చోటు రెండవ తరగతి, మొదటి తరగతి వెయిటింగు రూము మాత్రమే. మూడవ తరగతి ప్రయాణీకుల హాలు ఒక చిన్న చేపల మార్కెట్టు వలె ఉంటుంది. ఏ వూరైనా అంతే. ఎక్కడి అరటి తొక్క లక్కడే ఉండగా చిత్ర విచిత్రమైన వస్తుజాలాలతో ఆ పరిసరాలలోని అపరిశుభ్రతనంతా ప్రోగుచేసుకొని ఉంటుంది. అక్కడెలా పడుకోవడం? మూడవ తరగతి ప్రయాణీకు డెప్పుడూ చులకనే. అంచేత ఉన్నచోటనే ఆ చిన్న చెక్క మీదే అలా వెనక్కి ఒరిగాను. నిద్ర చోటు నెరుగదు. ఆకలి రుచినెరగదు గదా? బాగా నిద్ర పట్టింది. ఎప్పుడు వచ్చి నిలిచిందో బండి తెలియదు. గబగబా లేచి కన్పించిన పెట్టెలోకి చొరబడ్డాను. దైవానుగ్రహం వలన కొంచెం పల్చగానే ఉన్నారందులో. కూర్చున్న రెండు మూడు నిమిషాలకల్లా బండి కదిలింది. అక్కడినుండి రైలు అతి నెమ్మదిగా నడుస్తుంది. పట్టాలు తప్పినా ప్రాణ భయం మాత్రం ఉండదు. మెల్లగా చోటు చేసుకుని కిటికీవైపు తలనాన్చుకొని పడుకొన్నాను. గంటన్నర ప్రయాణం ఐనా రెండు గంటలవుతుంది రైలు వెళ్ళడానికి. ఆలోగా మరో చిన్న కునుకైనా చాలనుకొన్నాను.

పడుకొన్నాను గానీ నిద్రపట్టలేదు. వెన్నెల్లో ప్రకృతి ఎంతో రమ్యంగా వుంది. అలా కన్పించే పచ్చని పొలాల వైపు చూస్తుండగానే నాకీ కుక్క జ్ఞప్తికి వచ్చింది. పాపం! ఆ పూట అన్నం పొట్లం కొనిపెట్టాను. రోజూ అన్నం పెట్టే వాళ్లెవరు? దాన్ని కూడా పిలుచుకొని వచ్చివుంటే బావుండేదనుకొన్నాను. రైల్లో కుక్కను ఎక్కించక పోయినా ప్రత్యేకంగా పెట్టెలో ఎక్కించి వుండవచ్చు. పాడు డబ్బులు పోతేనేం. ఏ రూపాయో రెండు

రూపాయలో తీసుకొని ఉంటారు. చిటికెవేసి ఉంటే అది బండెక్కి ఉండేదేమో? వచ్చేటపుడు దాన్ని గురించి అనుకునే వ్యవధి కూడా లేకపోయింది. ఒక్కొక్క కుక్కను రూపాయ నుంచి వెయ్యి రూపాయల వరకూ కొనే వారున్న ఈ రోజుల్లో ఉచితంగా లభించిన జాగిలాన్ని, అందులోనూ ఎంతో ప్రేమనూ, కృతజ్ఞతనూ చాటిన కుక్కపిల్లను ఎందుకు వదిలిపెట్టానా అన్పించింది. ఆలోచిస్తుంటే దానికీ నాకూ ఏదో విడదీయరాని చెలిమి ఉన్నట్టు కన్పించింది. కేవలం ఒక కుక్క కోసం, దాని ఆకలిని తీర్చడం కోసం డబ్బు ఖర్చుపెట్టడం నా జీవితంలో అదే తొలిసారి. దానధర్మాలు చేయాలనే ఆకాంక్ష, ఉబలాటం అందరికీ ఉంటుందేమో నాకు తెలియదు కానీ అవకాశాలు మాత్రం అందరికీ లభించవు.

జీవితంలో అదొక మంచిరోజు అని అనుకొన్నాను. ఆ కుక్కను చూచి ఆ రెండు మూడు గంటల్లోనూ నేను చాలా విషయాలు నేర్చుకొన్నాను. కన్న తల్లిని స్మరించుకొన్నాను. మహానుభావుడైన వివేకానందుని జ్ఞప్తికి తెచ్చుకొన్నాను. ఒక ప్రాణి ఆకలిని చల్లార్చాను. అన్నిటికంటే ప్రధానమైనది క్రొత్త భాషను నేర్చుకొన్నాను. దైవ భావనను, కరుణాంత రంగాన్ని, నిష్కళంక ప్రేమను ప్రస్ఫుటింప చేయడానికి బ్రహ్మాండమైన పదజాలాలు అవసరంలేదు. చిన్న చిన్న మాటలతో వెన్న పూసల వలె గుండెలను ద్రవింప చేయడమటుంచి ఒకటి రెండు దీన దృక్కులతోనే గండశిలలను సైతం కరిగించవచ్చు.

మహాపండితులతో మాట్లాడాను. అఖండ మేధావులతో చర్చించాను. విశ్వ విఖ్యాతులైన కవి పుంగవులను దర్శించాను. నేను ఏదో అతిశయోక్తి అంటున్నానని నీవు అనుకోరాదు. ఈ కుక్కను చూచినపుడు కల్గిన హృదయ స్పందనం, ఆ వెనుకటి పవిత్రమైన భావనలు, మధురము దివ్యమూనైన స్మృతులు కలుగలేదు. ఇది యధార్థం. అందుకే ఆ రెండు గంటలూ నాకు నిద్రపట్టలేదు. నాకా కుక్కమీదే ధ్యాస మిగిలిపోయింది. ఉదయం మళ్ళీ కాట్పాడికి వెళ్ళి దాన్ని వెదికి యింటికి తెచ్చుకొందామనే నిర్ణయానికి వచ్చాను.

స్టేషన్ రాగానే బండి దిగాను. స్టేషన్ బయటికి వచ్చి ఒక ఒంటెద్దు బండిని కుదుర్చుకొని ఇంటికి బయలుదేరాను. బండి కదిలిందో లేదో వెనుక వైపున నీడ కన్పించింది. నా కలవరం కానీ ఏదో ఊర కుక్కై ఉంటుందని అనుకొన్నాను. కుక్క కన్పించలేదు గానీ నీడ మాత్రం కన్పిస్తూ ఉంది. బండీ ప్రక్కనే వస్తున్నది కావాలి. ఇది కాట్పాడీలో కన్పించిన కుక్క మాత్రం కాదు. అదెలా వస్తుందిక్కడికి అనుకొన్నాను. ఆశ్చర్యం! ఏం చెప్పను! బండి దిగి ఇంట్లో అడుగు పెడ్తున్నాను. ఈ జాగిలం నాతోనే గృహ ప్రవేశం చేసింది.

"ఎక్కడిదీ ఇదెక్కడిదీ?" అన్నది మా ఆవిడ. నేనే తీసుక వచ్చాను. చాలా మంచి కుక్క. పెంచుకొందామన్నాను. మా ఆవిడ వైపు దీనంగా చూస్తూ ఇంట్లో

## భరోసా

సంతానం లేదా, పరితాపం వద్దు
మా 'సంతాన' సాఫల్య కేంద్రం ఉండగా దిగులొద్దు
ప్రసవానికి వెతుకులాటెందుకు
పండంటి బిడ్డతో యింటికి పంపుతుంది మా 'ప్రసూతి' నర్సింగ్ హోమ్
మీ బిడ్డకి స్కూల్లో సీటుకు పరుగులెందుకు
చదువుల సరస్వతిని చేస్తుంది మా 'శారదా' విహార్–
ఇంజనీరింగు కోచింగ్‌కి వెతుకులాటెందుకు
సెంట్ పర్సంట్ గ్యారంటి యిస్తుంది మా 'సుశిక్షణా' కోచింగ్ సెంటర్
పెళ్ళి బట్టలకి, నగలకి ఎక్కిదిగే షాపులెందుకు
మా 'శుభలగ్న'ంలో మొత్తం ఎ టు జెడ్ వరకు అన్నీ కొనొచ్చు
పసందైన విందు భోజనాల కోసం ఆరాటం ఎందుకు
మా 'నలభీమ కాటరింగ్ సర్వీసు' షడ్రుచుల విందు అందిస్తుంది.
కారు కావాలా, యింటికి అప్పు కావాలా
పువ్వుల్లో పెట్టి యింటికి పంపిస్తుంది మా 'కల్పతరు' బ్యాంకు
మీ యింట మరణమా, జీవిని వైతరణీ దాటించే పూచి
మా 'సనాతన ధర్మ' సంస్థకి అప్పగించండి
మామూలు మనుషులే తోటి మనుష్యులకిన్ని విధాల భరోసా యిస్తుంటే
దేవదేవుడయి ఉండి మనిషికి మరునిమిషానికైనా భరోసా యివ్వవెందుకు!

–డి. కామేశ్వరి

జాగ్రత్తగా ఉంటానన్న భావాన్ని వెలిబుచ్చింది.

ఒక్కసారిగా సంతోషమూ, ఆశ్చర్యమూ, ఏదో చెప్పనలవికాని హృదయ చలనము... నాలుగైదు నిమిషాలు దీనివంక చూస్తూ కూచున్నాను. కిక్కురు మనకుండా మంచం క్రింద హాయిగా పడుకొన్నది.

పద్దెనిమిది మైళ్ళు రైల్లో వచ్చిందా? ఉహూ... కాదు, రైలు వేగం గంటకు తొమ్మిది మైళ్లే. ఇది మీటరు గేజీ. రాత్రి ప్రయాణం. రైలు వెంబడీ పరుగెత్తే వచ్చింది. నేను ఎక్కిన పెట్టెలో అది ఎక్కలేదని మాత్రం గట్టిగా చెప్పగలను. బహుశా సీటు క్రింద నక్కి ఉంటుందనుకోవడానికైనా పెట్టెలో రెండే బెంచీ లున్నాయి. ఎవరి కాలికైనా తగిలి ఉండాలి. మరెలా వచ్చి ఉంటుంది? సందేహం లేదు. రైలు వెంబడీ పరుగెత్తే వచ్చి ఉంటుంది. మధ్యలో రెండు స్టేషనల్లోనూ నేను దిగకపోవడం గమనించుకొని ఉంటుంది. మూడో స్టేషన్లో దిగడాన్ని పసికట్టి వెంబడించింది. ఇంత కష్టపడి ఎందుకు వచ్చిందంటావ్?" అంటూ కవిగారు ప్రశ్నించారు.

నేనేమీ చెప్పకపోవడం చూచి ఆయనే అన్నారు. "నేను మొదట కాలితో విసరినపుడు దానికి పెద్ద దెబ్బే తగిలి ఉంటుందేమో! కానీ ఆ వెనుక డబ్బులు పెట్టి పొట్లంకొని నే నందులో కొంచెమైనా తీసుకోకుండా దానికివ్వడాన్ని బట్టి అదేదో అర్థం చేసికొన్నది. ఎవరైనా కనికరిస్తే ఎంగిలి విదిలించి ఉంటారు. లేదా మిగిలిన అన్నం విసరివేసి ఉంటారు. లేదా తింటూ తింటూ ఒక కబళం దాని ముందు పడేసి ఉంటారు. నా విషయం మాత్రం దానికి ప్రత్యేకంగా కన్పించింది. దానికోసమే పొట్లాన్ని కొనడం దానికే ఆశ్చర్యమై ఉంటుంది. అంచేత ఎలాగైనా నాతో ఉండా లనుకొన్న దది. దాని బలీయమైన కోరికను నేను కాదనలేక పోయాను. ఇంటికి వచ్చాక తరిమిగొట్టినా అది వెళ్ళ దని తేలిపోయింది" అంటూ జాగిలంవైపు చూశారు కవిగారు. అది తోకను ఆడిస్తూ అతని మోకాళ్ళ మీద ముందరి కాళ్ళనుంచి నిలబడింది.

"అంతేగదరా? నువ్వు బలేగట్టివాడివి. చుట్టలై పోయాయి గానీ వెళ్ళి చుట్టల పెట్టెనిలా పట్టుకరా" అన్నారు కవిగారు జాగిలంతో.

అది నిమిషంలో తెచ్చిపెట్టింది పెట్టెను. కవిగారు చుట్టల పెట్టెను తెరుస్తూ "అమ్మాయికి పెళ్ళి ఐపోయాక యింట్లో ఆ పనీ ఈ పనీ చేసేవారు కూడా లేరు. అబ్బాయికేమో నెల్లూరులో ఉద్యోగమైంది. ఇప్పుడు ఒక కుర్రాడు చేసేటంత పనిని యిదొక్కటి చేస్తున్న దంటే నువ్వు నమ్మకపోవచ్చు" అన్నారు.

"ఔనారా!" అన్నాను జాగిలం వైపు చూచి. ఆశ్చర్యం! అది తలను క్రిందికీ పైకీ ఆడిచింది.

"చాలా విచిత్రంగా ఉంది" అన్నాను పైకిలేస్తూ.

"ఏముందిందులో విచిత్రం" అన్నాడు కవిగారు. ఏం చెప్పను.

"చాలా మంచికుక్క. ఇది మీ రన్నట్టు మనిషి కంటే మంచిది" అన్నాను సెలవు పుచ్చుకుంటూ.

కవిగారు చిన్నగా నవ్వారు. ఆ నవ్వులో ఎంతో సంతృప్తి కనిపించింది. జాగిలం నా వెంట కడప దాకా తోకనాడిస్తూ నిలబడింది. ఒకసారి ఒంటిని దువ్వి "మళ్ళీ వస్తాను" అంటూ వచ్చేశాను.

ఐదేళ్ళకు ముందు జరిగిన ఈ సంఘటనను జ్ఞప్తికి తెచ్చుకొన్నాను. కళ్ళ నిండుకూ నీళ్ళుక్రమ్మిన విషయం నాకు తెలియదు. నిశ్శబ్దంగా ఎంతకాలం కూచున్నానో కూడా తెలియదు. చేతిలో ఉన్న ఉత్తరాన్ని మళ్ళీ ఒకసారి చదువుకున్నాను.

"నీవు పంపిన రెండు పుస్తకములు అందినవి. మనస్తిమితం లేక వెంటనే చదవలేదు. త్వరలోనే చదవ గలను. మన శివంగి పోయింది. అది వీధిలో ఉన్న ప్పుడు మునిసిపాలిటీవారు పట్టుకొన్నట్టు ప్రక్కింటి పాప చెప్పింది. ఆ రాత్రి వెళ్ళి వ్యర్థ ప్రయత్నం చేశాను. ఆపాటికే దాని ప్రాణాలు తీసేశారు. వారం రోజుల వరకూ నాకు నిద్రపట్టలేదు. ఈ జాబు వ్రాస్తున్నప్పుడు కూడా అది నా పాదాలను స్పృశిస్తూ నా కలాన్ని లాగడానికి ప్రయత్నిస్తున్నట్టే ఉంది.

ఏమని వ్రాయగలను నా యావేదన! ఒక కుక్కను పట్టితెస్తే అర్ధరూపాయ బహుమానమట! భగవాన్! మన దేశంలో ఎందరు వివేకానందులు పుట్టినా, మరెందరు గాంధీ మహాత్ములు అవతరించినా ఏం ప్రయోజనం! ఎందుకో నాకు చాలా నిరుత్సాహంగా ఉంది. నా జాగిలం పోయింది! నా జాగిలాన్ని మనిషి చంపేశాడు. నన్నడిగి ఉంటే నా ప్రాణాన్నే యిచ్చి ఉండేవాడిని గదా! పాడు డబ్బు ఎంత పని చేసింది! ఎనిమిదణాల కోసం కుక్కను చంపడమా? నా హృదయం తరుక్కపోతున్నది. ఎక్కువ వ్రాయలేను! ఎలా వ్రాయగలను!..."

సెలవ్,

ప్రేమతో,

"..........." ■